కథ

# శాంతికి శిలువ

**చక్కిలం విజయలక్ష్మి**

**జీవితంలో వ్యాపారం ఒక భాగమైతే నీళ్ల మీద వెళ్లేందుకు నావలా బావుంటుంది. వ్యాపారమే జీవితమైతే మాత్రం మొసలి వీపు మీద ప్రయాణంలా అసలుకే మోసం వస్తుంది.**

***



రాజేష్ కారు చాలా స్లోగా వెళుతోంది. అతన్నెరిగిన వాళ్లెవరు చూసినా చప్పున చెప్పేస్తారు... అతనేదో తీవ్రమైన విషయం ఆలోచిస్తున్నాడని. ఎందుకంటే అలాంటి సందర్భాలలో తప్ప అతని స్పీడు మినిమం వంద కిలోమీటర్లకు తగదు. సెకన్లను(నిమిషాలకు కాదు) డాలర్లలో లెక్కవేసే రాజేష్ (రాజేష్ లాంటి వాళ్లు రూపాయల్లో లెక్క వెయ్యరు మరి) ఆ మాత్రం వేగంగా వెళ్లడంలో ఆశ్చర్యం లేదు. మరిప్పుడు స్లోగా డ్రైవ్ చేస్తున్నాడంటే అక్కడ మిస్సయ్యే సెకన్లకు ఆలోచన రూపంలో డాలర్స్‌గా గెయిన్ చేస్తున్నాడనే అర్థం.

తీవ్రమైన ఆలోచనతో అతని అందమైన ముఖం బాగా ఎర్రబడిపోయి వుంది. అలసిపోయి వుంది. అసహనంగా కూడా వుంది. పాపం.... సమస్య పెద్దదే అయ్యుండాలి. డబ్బుది కాకపోవచ్చు. ఎందుకంటే అతనికదొక సమస్య కాదు. చేయి తిరిగిన చిత్రకారుడిలా రూపాయి నోటును డాలర్‌గా, డాలర్‌ను మిలియన్‌గా, దాన్ని బిలియన్‌గా అవలీలగా చిత్రించేయగలడు తన బిజినెస్ కాన్వాస్ మీద! మరేమిటో? ఏమిటో మరి! ఆలోచించేస్తున్న కొన్ని సమస్యలను ఆలోచనలు పరిష్కరించలేవు. కాలం కలిసిరావాలి. అంతే... ఎవరికి, దేనికి, ఎప్పుడు ఆ టైం కలిసివస్తుందో ఎవరూ చెప్పలేరు. మరి రాజేష్‌కో?

ఎస్... ఆ టైం.... వచ్చేసింది.

ఆలోచనలో కళ్లు పరిసరాలను అంతగా గమనించలేవు. అనాలోచితంగానే అయినా మనకు సంబంధించిన విషయమైతే అది మన దృష్టి పరిధిని దాటిపోదు.

పది గజాలు ముందు వెళ్లిపోయిన రాజేష్, తనదైన దాన్ని దేన్నో దాటుకొని వెళ్లిపోయిన ఫీలింగ్ కలిగి, రివర్స్‌లో వెనక్కు వచ్చాడు...స్పాట్‌కు.

అక్కడ పెద్ద విశేషం ఏమీ లేదు. ఓ మనిషి

లాంటి మనిషి (అందరూ మనుషుల్లా వుండరు మరి. మనమే గుర్తుపట్టాలి) రోడ్డు మీద రంగు చాక్‌పీస్‌తో బొమ్మ వేస్తున్నాడు. అంతే...

రాజేష్ కారు కాస్త ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కగా పార్క్ చేసి అక్కడికి వచ్చాడు.


ఆ వ్యక్తికి రెండు కాళ్లు లేవు. తొడల వరకే వున్న కాళ్లను బారచాపి, ఓ పక్కకు కొద్దిగా, బొమ్మ వేసేందుకు అనుకూలంగా తిరిగి రోడ్డు మీద బొమ్మ వేస్తున్నాడు. పిరుదులతో దేకాలి కాబట్టి వాటిని కవర్ చేస్తూ నడుము చుట్టూ దొంతరలా మందంగా పాత బట్టలూ, వాటిని కవర్ చేస్తూ ఇంకా సేఫ్టీ కోసం ఓ రబ్బరు షీటు కట్టుకున్నాడు. అది కూడా రోడ్డు రాపిడికి రంధ్రాలు పడిపోయి వుంది. ఛాతీ మీద మాసిపోయి చిరుగులు పట్టిన బనీను. జుట్టు కొన్ని నెలలుగా నూనె లేక ఎండిన నల్ల గడ్డిలా వుంది. ముఖానికి, చేతులకు, ఛాతికి ఎక్కడపడ్తే అక్కడ చాక్‌పీస్ రంగులు అంటి వున్నాయి. అతని ముఖం ఆకలికి అద్దంలా వుంది. మొత్తం మీద అతడు కాళ్లు నరికేసిన పేదరికంలా వున్నాడు. రంగులద్దిన విరిగిన బొమ్మలా వున్నాడు.

పక్కన మకిలి పట్టిన ప్లాస్టిక్ డబ్బా, దానిలో సగం సగం వాడిన రంగు రంగుల చాక్‌పీస్‌లు. దాని వెంటే చాక్‌పీసులు అద్దుకునేందుకు కాబోలు హేండిల్ చీలిపోయిన నీళ్ల మగ్గు. పక్కనే రోడ్డు మీద మూడు వంతులు పూర్తయిన పెద్ద బొమ్మ. బొమ్మ మాత్రం అతనిలా లేదు. మంచి మంచిరంగులతో మాంచి రంజుగా, జబర్దస్తీగా వుంది. అవయవాలు, ముఖ కవళికలు అమరినట్లున్న రంగులు....ప్రాణం పోయడం మాత్రమే మిగిలిపోయిన బ్రహ్మ చేసిన బొమ్మలా వుంది.

దాన్ని నిశితంగా చూసిన రాజేష్ ముఖం వెలిగిపోయింది. ఓ అద్భుతమైన కళాఖండాన్ని చూసిన అనుభూతితో మైమరచిపోయాడు. నిజానికి అది అలాగే వుంది.!

క్షణాల్లో అతనిలోని వ్యాపారి ఆ దృశ్యాన్ని బ్యాలెన్స్ షీట్‌లో బేరీజు వేసేశాడు. అతని ముఖం మరోసారి మరింతగా వెలిగిపోయింది.

రోడ్లు వెడల్పుచేసే కార్యక్రమలో చెట్లు కొట్టేసే అగత్యం ఏర్పడినప్పుడు, ఈ మధ్య ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ రక్షణాభిలాషులు కోరిక మేరకు ఆ పెద్ద పెద్ద వృక్షాలను ఆ పళంగా ఏమాత్రం చెట్టు డిస్టర్బ్ కాకుండా, ఆకుకూడా రాలకుండా వాటిని కావాలని కోరుకున్న వ్యక్తులు ఇంటి ముంగిట్లోకో, పెరట్లోకో అటవీ అధికారులు షిఫ్ట్ చేసేస్తున్నారు.... దాని రిక్వైర్డ్ టెక్నాలజీతో! అలా ఈ బొమ్మ వున్న రోడ్డును మొత్తంగా తన బంగళాలోని హాలు గోడ మీదికి షిఫ్టు చేయాలనిపించింది రాజేష్‌కు. ఈ కాళ్లు లేని వాడి చేతుల్లో ఇంత కళా కౌశలమా! అతని ముఖం ఇంకా బొమ్మ గీయని తెల్లని కాన్వాస్‌లా తెల్లబోయింది.




ఇదంతా ఏమీ పట్టించుకోకుండా బొమ్మ గీస్తున్నాడు ఆ వ్యక్తి. అతనికిది మామూలే. ఎవరెవరో వస్తుంటారు వాళ్ల వీలును బట్టి సెకన్లో, నిమిషాలో ఆగి చూస్తుంటారు. బుద్ధి పుడ్తే ఏదో చిల్లర నాణేలు బొమ్మ మీద విసిరి పడేసి వెళ్లిపోతుంటారు. ఆగిన ప్రతివారినీ చూసే అగత్యం అతనికి లేదు.

ఆ బొమ్మను చాలా సేపు చూశాడు రాజేష్. అతని మనసు కాన్వాసు మీద అతను వేసుకున్న ఊహాచిత్రానికి రంగులు వేశాడు. మెరుగులు దిద్దాడు. వెల కూడా కట్టాడు. ఏక పక్షంగా సాగిన ఆ బిజినెస్ డీల్ రాజేష్‌కు బాగా తృప్తినిచ్చింది.

ఆ బొమ్మ గీసే అతనికేసి తిరిగి ''ఇదిగో నీ పేరేంటి'' అడిగాడు.

అతడు తిరిగి చూశాడు. రాజేష్ వేషభాషలు చూసి బిల్‌గేట్స్ రోడ్డు పక్కన ఆగి చేపల బేరం చేసినట్లు అనిపించింది.

''రాము సార్'' అతని గొంతులో పేదరికం తాలూకు ఘోష, అవిద్య తాలూకూ యాస లేకపోవడం రాజేష్‌ని ఆశ్చర్యపరిచింది.

''చెప్పండి సార్'' అన్నాడు రాము. చెప్పవలసిన బాధ్యత రాజేష్‌దే అయినా...

''నీతో కొంచెం పనుంది. ఓసారి మా ఇంటికి రావాలి''

''మా ఇంటికి రాగలవా?'' అని కాకుండా 'రావాలి' అనడం గమనించాడు రాము. రెంటికి చాలా తేడా వుంది.

''మీలాంటి గొప్పవారికి నాలాంటి గరీబోడితో ఏం పని సార్?'' అన్నాడు. అయినా వినయంగానే..

''ఎవరితో ఎప్పుడేం పని పడ్తుందో చెప్పలేం కదా! కొంచెం పని వుంది. అంతే '' అన్నాడు రాజేష్ పైకి. లోపల మాత్రం 'వసుదేవుడంతటి వాడికే గాడిద కాళ్లు పట్టుకోక తప్పలేదు కదరా గాడిదా' అనుకున్నాడు.

''చెప్పండి సార్''

చుట్టూ ఓ సారి చూసి '' ఇక్కడ కాదు మా ఇంటికి వెళదాం'' అన్నాడు రాజేష్.

'నా పని భంగమవుతుంది సార్. చూడండి... బొమ్మ సగంలో వుంది.''

''ఫర్వాలేదు. ఆ బొమ్మ మీద నీవెంత సంపాదించగలవో అంతకు నాలుగు రెట్లిస్తాను.'' రాజేష్ మాట పూర్తిచేయలిందింకా...

''మీరివ్వగలరు సార్. కానీ నేనే దాన్నలా మధ్యలో వదిలి రాలేను. అయినా పనేంటో చెప్పకుండా...'' చివరిమాట నసిగాడు రాము.

కొంచెం చికాకు కలిగింది రాజేష్‌కు. ఎందుకంటే రాజేష్ లాంటి వాళ్లు ఇవతలి వాడికేం చేయనక్కర్లేదు. రాజేష్ లాంటి వాళ్లను చూడగానే (వాళ్ల ఆడంబరాన్ని) చూడగానే ఎదుటి వాళ్లకి 'జీ హుజూర్'లాంటి భావాలు తన్నుకు వస్తాయి. అలా కాలేదేమని రాజేష్ చిరాకు. అయినా నెమ్మదిగా అన్నాడు. '' చెప్పానుగా... రహస్యమేమీ లేదు. నీకు హాని చేసేదీ కాదు. నేనిక్కడ ఇలా ఎక్కువ సేపు నిలబడ్తే బాగుండదుకదా!''

రోజుల తరబడీ రోడ్డు మీదే కూర్చుండిపోయే రాము ఆ మాటకు రాజేష్‌కేసి నిర్లిప్తంగా చూశాడు. రాజేష్‌కు ఆ చూపులోని భావం అర్థం కాలేదు.

''ఏమంటావు?'' రెట్టించాడు.

''సరే వస్తాను... కానీ బొమ్మ పూర్తి చేశాకే''

రాము పక్కనే ప్లాస్టిక్ మగ్గులో నీళ్లున్నాయి. మగ్గు తీసి అందులోని నీళ్ల ఆ బొమ్మ మీద గుమ్మరించాలన్నంత అసహనానికి గురయ్యాడు రాజేష్. కానీ అతను వ్యాపారి.... నిగ్రహానికి బాగా భాష్యం

తెలిసినవాడు. పని తనదైనప్పుడు, పెద్దమనిషి తరహా పాటించాలనే పద్ధతి ఎరిగినవాడు. పళ్ల బిగువున ఓకే.. ఓకే.... అయితే ''వీలయినంత త్వరగా'' అన్నాడు ముఖానికి చిరునవ్వు అతికించుకుంటూ. ఆ ముఖం మీద ఆ నవ్వు 'నవ్వుతున్న పెదాల' స్టిక్కర్ అతికించినట్టుంది. అంటూనే కారుకేసి నడిచాడు. కారులో కూర్చుని దూరంగా కనిపిస్తున్న ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు రాజేష్. ప్రపంచంలో అంత కంటే ముఖ్యమైన, అమూల్యమైన పని లేదన్నంత శ్రద్ధగా ఏకాగ్రతగా, ప్రేమగా బొమ్మ పూర్తి చేస్తున్నాడు రాము.

బొమ్మ పూర్తి చేయాలనే రాము పట్టుదల రాజేష్‌కు ఆశ్చర్యం కలిగించలేదు. పని మొదలుపెట్టిన ఎవరికైనా ఆ పని పూర్తి చేయాలనే వుంటుంది. బొమ్మ పూర్తి చేయాలనే ఉద్దేశం కంటే సగంలో వదిలి వెళ్లలేని అతని నిబద్ధత నిశ్చేష్టపరిచింది. పూర్తి చేసి రావడం, పూర్తి చేయకుండా రాలేకపోవడం...... ఈ రెంటి మధ్యా వున్న ఆ సున్నితమైన తేడాని గ్రహించ గలిగాడు రాజేష్. బొమ్మ పూర్తి చేయడమనేది ఓ పని పూర్తిచేసి పొందే రిలీఫ్ కిందికి వస్తుంది. సగంలో వదిలి వెళ్లలేక పోవడమనేది ఆ వ్యక్తి నిబద్ధతకు, చేస్తున్న పనికి ఇచ్చే గౌరవాన్ని, ముఖ్యంగా అగౌరవ పరచలేని మార్దవాన్ని తెలియజేస్తున్నాయి. కాళ్లు లేని అతను తన పనిపట్ల అంత కమిట్‌మెంట్‌తో, గౌరవంతో స్థిరంగా నిలబడడం రాజేష్ లాంటి మెటీరియలిస్టుకు కూడా ముచ్చట గొలిపింది.

***

రాజేష్ పర్సనల్ రూం అది. అందంగా, ఆడంబరంగా, మంచి కళా దృష్టి వున్న ఆర్టిస్ట్ వేసిన చిత్రపటంలా వుంది. రాము లాంటి దిష్టిబొమ్మను తాత్కాలికంగానే అయినా ఆ షోకేస్‌లోకి తీసుకురావలసిన అవసరం లేదు రాజేష్‌కు. కానీ రాజేష్‌ది చాలా ముందు చూపు.

''నీవునాకో చిత్రం గీసి ఇవ్వాలి'' డైరెక్ట్‌గా విషయంలోకి వచ్చాడు రాజేష్.

గోడ కేసి చూస్తూ ''ఇంత మంచి బొమ్మలు అలంకరించుకున్నారు. నేనింతకంటే గొప్పగా వేయలేనుకదా? నావి రోడ్డు మీద సుద్ద ముక్కలతో గీసే బొమ్మలు'' అని '' ఈ చిత్రాలు ఎవరు వేశారు సార్ చాలా బాగున్నాయి'' అన్నాడు రాము.

''మా తమ్ముడు మహేష్ మంచి ఆర్టిస్ట్''

''అలాంటప్పుడు...'' తెల్లబోయాడు రాము.

''అలాంటప్పుడే... అందుకే... నీవు చిత్రం గీయాలి''

''అదే వివరంగా చెప్పండి''

''చెప్పినా నీ కర్థం కాదు''

''పోనీ అర్థమయ్యేలా చెప్పండి''

విసుగును ఒక్క తల విదిలింపుతో ఒదిలించుకొని ప్రసన్నగా నవ్వుతూ చెప్పాడు రాజేష్.

***

ఓ ప్రముఖ జాతీయ సాంస్కృతిక సంస్థ జాతీయ స్థాయిలో చిత్ర లేఖన పోటీ నిర్వహిస్తోంది. బహుమతి మొత్తం పాతిక లక్షలు (ఇప్పుడు చిత్రాల స్థాయి లక్షలు దాటి కోట్లలో నడుస్తోంది). అది కాదు ముఖ్యం బహుమతి పొందిన ఆర్టిస్ట్‌కు ప్రపంచస్థాయి ప్రముఖ చిత్రకారుల చిత్రాల్ని, వీలైనంతమందీ ఆ స్థాయి చిత్రకారుల్ని చూసే అవకాశం కల్పిస్తారు. అయితే అది కూడా ముఖ్యం కాదు. రాజేష్ తమ్ముడు మహేష్ పోటీలో పాల్గొంటున్నాడు. బిజినెస్‌లో రాజేష్ ప్రత్యర్థి తమ్ముడు అనిల్ కూడా ఆర్టిస్ట్. ఆ కుర్రాడు కూడా పోటీలో పాల్గొంటూ అద్భుతమైన చిత్రాన్ని వేశాడట. దానికి తప్పక బహుమతి వస్తుందని ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే రాజేష్‌కు అది ఆత్మహత్యా సదృశ్యం. ఆ అబ్బాయి గెలవకూడదు.

అదే జరిగితే రాజేష్ ఓడిపోయినట్లే. రాజేష్ మహేష్ కాదు. అందుకే... ఏదైనా అద్భుతం జరిగి తన తమ్ముడు గెలవాలి. అలా జరగకపోయినా 'జరిపించాలి'. అయినా గెలిపించాలి. రోడ్డు మీద రాము బొమ్మ చూశాక ఏం జరిపించాలో అర్థమైంది రాజేష్‌కు. ఆ విషయమే చెప్పాడు రాముకు.

***

''సార్... నేను కూడా చదువుకున్న వాడిని. రోడ్డు మీద బొమ్మలు గీసినా ఆర్టిస్ట్ ఆర్టిస్టే. కదా... నాలోని ఆకలి గరీబు కాకపోయినా ఆర్టిస్ట్‌కు ఆత్మగౌరవం వుంది. దుర్వినియోగానికి నా కళను అమ్ముకోలేను'' అన్నాడు రాము.

రాము ఎక్కువ డబ్బు డిమాండ్ చేస్తాడనుకున్నాడు గానీ ఇలా మాట్లాడ్తాడని అనుకోలేదు రాజేష్. తమాయించుకొని ''పేరు మాత్రమే నీది వుండదు. బెనిఫిట్లన్నీ నీకే. పైగా నేను నీకు...'' రాజేష్ మాటను పూర్తి చేయనివ్వలేదు రాము.

''అసలుది ఒదులుకున్న తర్వాత మిగిలింది నాకెందుకు సార్. అయినా పేరు గురించి నాకు తాపత్రయం లేదు. అంత పేరు మోసే కెపాసిటీ నాకు లేదు.''

''మరి?''


''.....''

''చెప్పు.. పేరు గురించి తపన లేనప్పుడు ఎలా అమ్ముకుంటే ఏం?''

''.....''

'కళను రోడ్డుమీద అమ్ముకుంటున్న వాడివి. గౌరవంగా గదిలో అమ్ముకోవడానికేం! దానికీ దీనికీ తేడా ఏముంది? కావలసినంత...''

''కళ నాకు అమ్మలాంటిది సార్. అయినా అమ్ముకుంటున్నాను. ఆకలి కోసం మాత్రమే అమ్ముకుంటున్నాను. ఇందుకు నేను సిగ్గుపడడం లేదు. ఎందుకంటే అమ్మ వుంటే తనను తాను అమ్ముకుని అయినా ఆకలిగొన్న బిడ్డకు అన్నం పెడుతుంది. నా కళ కూడా



అమ్మలా నా కడుపు నింపుతోంది అది చాలు.''

''...కానీ కళ నీకు పరమాన్నం పెట్టే అవకాశం వున్నప్పుడు పాచిపోయిన అన్నం తినాల్సిన ఖర్మెందుకు? నా మాట విను. నేను...''

''లేదు సార్. నేను కడుపు కోసం కళను అమ్ము కునే వాడిని గానీ దాంతో పడుపు వృత్తి చేయించ లేను.''

''వింటున్నాను కదా అని నోటికొచ్చింది మాట్లా డకు. ఎవరితో ఏ ం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?''

''నోటికొచ్చింది కాదు సార్. మనసులో వున్నది మాట్లాడుతున్నాను. నేను రోడ్డు మీద వేసిన బొమ్మ లు చూడండి. నచ్చితే నాలుగు పైసలు వేయండి. అలాంటి బొమ్మ కావాలంటే అడగండి. వేసిస్తాను. అంతే కానీ నా బొమ్మ తీసికెళ్లి మీ తమ్ముడి పేరు గెలుచుకొస్తానంటే నేనెలా బొమ్మ వేయగలను సార్?''

రాము మాటలు రాజేష్‌కు చెప్పలేని ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. అవసరం అతనికి నిగ్రహాన్నిస్తోంది.

''ఊర్కే అడగడం లేదు కదా.. దానికి మించి ప్రతి ఫలం ఇస్తానంటున్నాను.'' సహనానికి మారుపే రులా ముఖం పెట్టి అడిగాడు రాజేష్.

''మీరు ఊర్కే బొమ్మ వేసి ఇవ్వమని వుంటే నేను సంతోషంగా వేసిచ్చేవాడిని. కానీ ప్రజల్ని, కళను, కళాకారుల్ని మోసం చేస్తూ వేయమంటున్నారు.''

''దాని వల్ల నీకేం నష్టం? నిజాయితీగా చెప్పి నందుకేగా నీకీ టెక్కు'' క్రమంగా రాజేష్‌లోని తెచ్చి పెట్టుకున్న సహనం జారిపోతోంది.

''నిజమే... మీరు చెప్పకపోయి వుంటే నాకు అప రాధ భావం వుండేది కాదు. తెలిసీ నేనెలా చేయలేను. మా పిచ్చి అమ్మ నన్నలా పెంచలేదు'' తల్లి జ్ఞాప కంతో రాము కళ్లు అరమోడ్పులయ్యాయి.

''చూడు రాము చెప్పేది అర్థం చేసుకో. సంస్కారం, నీ సెంటిమెంట్లు నేను కాదనడం లేదు. కానీ నా సెంటిమెంట్స్ కూడా నీవర్థం చేసుకోవాలి. నాకీ చిత్రలేఖనంలో గెలవటం ముఖ్యం కాదు. నా దృష్టిలో ఇవన్నీ ఆఫ్టరాల్. కానీ నా ప్రత్యర్థి తమ్ముడు కాంపిటీషన్‌లో పాల్గొంటున్నాడు. గెలిచేలా వున్నా డు. వాడు గెలవకూడదు. వాడు గెలిస్తే నేను ఓడిపో తాను. వాడు గెలిస్తే ఓడిపోయేది నా తమ్ముడు కాదు నేను.''

''సార్! మీకు మీకు గొడవలుంటే మీరు మీరు చూసుకోండి. అనవసరంగా చిన్న వాళ్లను ఈ రొంపి లోకి లాగడమెందుకు? స్వచ్ఛమైన కళకు కళంకాన్ని ఆపాదించడమెందుకు? అతడిని గెలవనివ్వండి. మీ రంగం మీకుందిగా. మీకు మీ ప్రత్యర్థి పోటీ వ్యాపా రంలోనే గానీ చిత్రలేఖనంలో కాదుగా?''

''నీ బోడి సలహా నాకు అక్కర్లేదు. నీకు అర్థం కావడం లేదా? గెలిచేది వాడు... వాడు... వాడి తమ్ముడుకాదు.'' గట్టిగా అరిచాడు రాజేష్.

''పోటీ అనేది ఆరోగ్యకరమైన ప్రగతి సార్. దాన్నిలా అనారోగ్యకరంగా...'' అంటూపూర్తి చేయ లేదు.

''రోడ్డు మీద సుద్ద ముక్క బొమ్మలు గీసుకునే ఆఫ్టాల్ వెధవ్వి. నాకు సలహా ఇస్తావా? నీకు హై క్లాసు సొసైటీ గురించీ, దాని ఈగోస్ గురించీ ఏం తెలుసు? ఈ గీతా బోధ ప్రోగ్రాం ఏదో రేపు రోడ్డు మీద బొమ్మ వేసుకో. ఈ రోజుకు నా పని చేసిపెట్టు. నీవు నా పని చేసిపెట్టావనుకో. నీకు జన్మలో మళ్లీ రోడ్డు మీద బొమ్మలేసుకునే ఖర్మ లేకుండా చేస్తాను.''

''నేను దీన్ని ఖర్మలా అనుకోవడం లేదు సార్. అమ్మలా అన్నం పెడుతోంది నాకు శాశ్వతమైన ఉపా ధి చూపించింది... నా అవిటితనానికి అందుబా టులో వున్న ఉపాధి.''

''డైలాగులు బాగానే చెప్తున్నావు. అలా చెప్తున్నా ననే ఆనందంతో ప్రాక్టికల్‌గా ఆలోచించడం మరిచిపో తున్నావు. అలా ఎప్పుడైనా చెప్పుకోవచ్చు. సిరి రా మోకాలొడ్డకు. ఇది మాత్రం ఎప్పుడు పడితే అప్పుడు రాదు.''

''మీరు చెప్పింది బాగానే వుంది సార్. కానీ అడ్డం ఒడ్డడానికి నాకు మోకాలు కూడా లేదు. ఓ రోడ్డు యాక్సిడెంటులో నా రెండు కాళ్లనూ పోగొట్టు కున్నాను. దాంతో చదువుకున్నా ఉద్యోవకాశాలు పోయాయి. అందువల్ల కాళ్లనే కాదు. కళనీ రోడ్డుకే అంకితం చేయక తప్పలేదు. నిజానికి రోడ్డు నా పట్ల తను చేసిన తప్పు దానికి ఇలా కాంపన్సేషన్ ఇచ్చింది... ఇదిగో ఇలాగా నా కళకు కాన్వాసులా''

రాజేష్‌కు కోపం తారాస్థాయికి చేరింది. రాము మళ్లీ అన్నాడు. '' ఇప్పుడు రోడ్డుకు, కళకు ద్రోహం చేయలేను. అలా చేస్తే మరో యాక్సిడెంట్‌లో నా చేయే పోవచ్చు... బొమ్మలు కూడా వేసేందుకు పనికి రాకుండా....''

''చూడూ... ఇప్పటికే చాలా మర్యాద ఇచ్చాను. ఈ మర్యాద కిడ్నాప్‌గా మారకుండా చూసుకో....'' కటువుగా అన్నాడు రాజేష్.

ఆ తర్వాత మాటల కంటే చేతలే ఎక్కువ పని చేసాయి. ఎంతకీ రాము లొంగిరాకపోవడంతో రాజేష్ అతన్ని తన పర్సనల్ రూము అవతల వున్న సౌండ్‌ప్రూఫ్ గదిలో పడేసి తాళం వేసేశాడు. అక్కడ నేలకు సమాంతరంగా(రాముకు అనుకూలంగా) వున్న స్టాండుకు బిగించిన కాన్వాసు, రంగులు, బ్రష్ లాంటి చిత్రలేఖనానికి అవసరమైన సరంజామా, తినుబండరాలు, మంచినీళ్లు....వెళుతూ... వెళుతూ రాజేష్ చెప్పాడు. ''మాట వింటే రాజభోగం అనుభ విస్తావు. వినకపోతే? అనకు. నే చెప్పాక వినకపో వడం అంటూ వుండదు. హాయిగా విని బొమ్మ వేసుకో. ఆ తర్వాత రాజాలా బైటికి పంపిస్తాను''

వారం రోజులు గడిచింది. రోజూ వచ్చి వాకి ట్లోంచి కాన్వాసు కేసి చూసి మౌనంగా వెళ్లిపోయేవా డు రాజేష్. రామూ తల కిందులైపోయాడు. విశాల ప్రపంచంలో ఆరు బయట రోడ్డు మీద ఊరకుక్కలా (రాజేష్ అభిప్రాయం ప్రకా రం)స్వేచ్ఛగా, బుద్ధిపుట్టి నప్పుడు బొమ్మలేసు కుంటూ తిరిగిన వాడిని, ఇలా ఏసి గదిలో సకల భోగభాగ్యాల మధ్య బంధించేసరికి ఊపిరందక ఉక్కిరిబిక్కిరైపోయాడు. ఆ చేతి వేళ్లకు కుంచె కట్టి కాన్వాసు మీద ఫెవికాల్‌తో అతికించినట్లు అశాంతితో అల్లాడిపోయాడు. రాము గొంతు చించుకున్నా వినే నాథుడే లేడు. ఆ అవకా శమూ లేదు. దుఃఖంతో రాము కళ్లతో పాటు కుంచే అర్ద్రమై పోయింది. కాన్వాస్ మీద అతని మనో



భావాలను, భావోద్వేగాలను అందంగా అనేకంటే ఆవేదనగా కన్నీటి చిత్రం వేసేసింది... అత్యంత సహజంగా.

ఆరోజు గదిలోకొచ్చాడు రాజేష్. యాధాలాపంగా కాన్వస్‌కేసి చూసి కాన్వస్ మీది చిత్రాన్ని చూసి తాను ఓ చిత్రంలా నిలబడిపోయాడు.

బంధనాలు లేకుండా భావోద్వేగంతో వేసిన చిత్రం! మరుగు తొలగిన మనసును యథాతథంగా మలచిన చిత్రం! రాజేష్ మనసును పిచ్చి పిచ్చిగా కొల్లగొట్టిన చిత్రం!!

ఆకాశపు నీలిరంగు బ్యాక్ డ్రాప్ మీద మట్టి రంగు శిలువ. దాని మీద పెడరెక్కలు విరిచి శిలువ వేసిన అందమైన, సుకుమారమైన తెల్లపావురం. నుదుటి మీద, సాచి కట్టిన రెక్కల మీద, గుండెల మీద, లేలేత గులాబీరంగు, కాళ్ల మీద మేకులు దిగగొట్టి వున్నాయి. స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరే శాంతి పావురాన్ని నిష్కారణంగా బంధించి శిలువ వేస్తే... ఆ ఆశ్చర్యం...దైన్యం, బాధ, నిస్సహాయత, జాలి... తల వేలాడేసిన ఆ పావురం దుఃఖంతో ప్రస్ఫుటంగా...!

చిత్రం పైన 'శాంతి శిలువ' అని రాసి వుంది.

ఆనందంతో పిచ్చివాడైపోయాడు రాజేష్.

''వెరీ గుడ్... ఫెంటాస్టిక్.... మార్వెలెస్...... సూపర్బ్...'' ఆంగ్ల భాషలోని అభినందన పూర్వక పదాలన్నీ గబగబా అనేసాడు.

''రామూ...! నీవే... నీవే... వేశావా! నిజంగా! ఎంత అద్భుతంగా వేశావ్!'' రాజేష్ చాలా సేపు ఆ అనుకోని అనుకూల పరిస్థితి పట్ల దిగ్భ్రాంతుడై వుండిపోయాడు. అయితే కాసేపటికి అతని భృకుటి ముడిపడింది.

''ఏమిటిది! రామూ, చిత్రంలో ఏదో లోపం వుంది. అసంపూర్తిగా వుంది చూడు...''

రామూ నిర్లిప్తంగా చూశాడు.

రాజేష్ చిత్రం కేసి తదేకంగా చూస్తూ....

''ఉందా? ఏమిటది గుర్తించావా?''

రాజేష్ రామూ కేసి చూడ్డం లేదు. రాము బొమ్మ వేశాడు. అంటే తన మాట అంగీకరించాడనే భావంతో వున్నాడతను. రెండు మూడు సార్లు రెట్టించినా రామూ పలకలేదు.

''పలకవేంటి? నీకూ అర్థం కావడం లేదా? చిత్రంలో ఏదో వెలితి...''

''ఆ చిత్రం మీ కోసం వేసింది కాదు. అది నా బొమ్మ. నా పరిస్థితి. నా మానసిక స్థితి.'' నీరసంగా అన్నాడు రాము.

''అంటే...'' రామూ కేసి చూశాడు రాజేష్.

అన్ని రోజులుగా అన్నాన్ని కాకుండా ఆవేదనను భోంచేస్తున్నాడేమో నీరసించిన కళ్లలో ప్రాణాలుపెట్టుకొని వున్నాడురాము.

''ఏంటిది! భోజనం చేయడం లేదా?''

''అవసరం లేదు''

''నీ ఖర్మ. సరే. బొమ్మ బాగుంది. బాగాచూసి ఆ లోపమేంటో కరెక్ట్ చేయ్. ఆ తర్వాత...''

''చెప్పానుగా అది నా బొమ్మ. నాతోనే వుంటుంది. ఇంకేమీ చెయ్యను'' స్థిరంగా రాము.

ఆ తర్వాత చాలా సేపు వాదన జరగింది. వాగ్యుద్ధం జరిగింది. రామూ వినలేదు. బహుశా ఆ కరెక్షనేమిటో అతనికే అర్థమై వుండదు. అర్థమైనా చేసి వుండడు.

రాజేష్ సహనం కోల్పోయాడు. రాము ధీమా, మొండితనం, తన అసహాయత...అన్నీ అతని ఈగోను దెబ్బతీశాయి. పశువును చేసాయి. ఆవేశంతో పక్కనే వున్న టీపాయ్ మీది గాజు ఫ్లవర్ వాజ్‌ను తీసి రాము ముఖం కేసి విసిరాడు. అది రాము ముఖాన్ని గాయపరుస్తూ భళ్లున బద్దలై ముక్కలుగా కింద రాలిపడింది. రాము ముఖం పగిలి రక్తం ఎదుట వున్న చిత్రం మీద చిందింది.

ఆవేశంగా, ఆందోళనగా చిత్రం కేసి చూసిన రాజేష్ ఆశ్చర్యంతోనే కాదు. ఆనందంతో నిశ్చేష్టుడైపోయాడు.

రాము ముఖంలోంచి చిందిన రక్తం సరిగ్గా శిలువ మీది పావురానికి మేకులు దించిన చోట్ల పడి అంతవరకూ డ్రైగా వున్న గాయాల్లోంచి మేకుల దగ్గరనించి ధారగా జారుతోంది! దాంతో చిత్రం పూర్తయింది.... పర్‌ఫెక్ట్‌గా!

అయితే రాజేష్‌కి అర్థం కానిదొకటి. కారుతున్న రక్తం మధ్యలోంచి మసక బారుతున్న కళ్లతో చూస్తున్న రాముకు కనపడింది. అది... తల ఓ వైపు ఒరిగిపోగా ఒంటి కన్ను మాత్రం కనిపిస్తున్న పావురం. ఆ కంటిలోంచి ఓ రక్తం చుక్క జారి వుంది!

స్పృహ కోల్పోతుండగా ఏవో మాటలు వినిపించాయి రాముకు.

''అన్నయ్యా, నీవిలా చేస్తావని నేననుకోలేదు. నేను మెటీరియలిస్టును కాను. ఆర్టిస్టును. రక్తం రంగుతో వేసిన చిత్రంతో నేను గెలవలేను. ఇదిగో, వాళ్లు పంపిన ఫైనల్ యాక్సెప్టెన్స్ లెటర్. చింపేస్తున్నాను. ఇక నా మీద అనంత్ గెలవలేడు. కాబట్టి నీవు ఓడిపోవు సరేనా?'' ఏవో కాగితాలు సర్రున చింపేసిన శబ్దం!

## మనమీదేనత్రోయ్...

సరసి..

